# లోటు బడ్జెట్

శ్రీమతి
వేదుల
మీనాక్షీదేవి

ఆఫీసునుండి వచ్చి అరకప్పు కాఫీ త్రాగి పత్రికచేత్తో పట్టుకుని పడక కుర్చీలో వాలాడు గోపాలరావు. పెద్ద అక్షరాలతో మద్రాసు ప్రభుత్వపు 'లోటు బడ్జెట్' అని చదివాడు. "ఏమిటీ ! స్టేటు ప్రభుత్వానికి కూడా లోటు బడ్జెట్టేనా ?" అనుకుంటూ చదువుతున్నాడు.

"నాన్నగారూ నాకూ తమ్ముడికీ జీతం కట్టాలి. పుస్తకాలు కొనాలి. 'పూర్ ఫండ్' యివ్వాలిట. మొత్తం లెక్కచూసి యిచ్చెయ్యండి" అన్నాడు మాధవుడు.

గోపాలం వులిక్కిపడ్డాడు. ఎంతసేపటి నుండో సీరియస్‌గా పేపరు చదువుతున్నవాడు మళ్లీ ప్రపంచంలో పడ్డాడు.

"ఊఁ ? జీతమా ? యెప్పుడు కట్టాలి?" అని అడిగాడు.

"ఇవ్వాళ ఆఖరిరోజు. ఇవ్వాళకట్టక పోతే ఫైనిచ్చుకోవాలి కూడాను" అన్నాడు మాధవుడు.

"సరే" అంటూ గోపాలం వంటింట్లోకి వెళ్ళాడు. పోనీ వెళ్ళినవాడు వెళ్లినట్టూరుకున్నాడా ? ఆవిడతో "వచ్చే ఆదాయాన్ని బట్టి ఖర్చుచెయ్యాలి. ఆఖర్చు ఆదాయాన్ని మించకుండా సర్దుకోవాలి. అనవసరమైన ఖర్చులు చెయ్యొద్దు. అవసరమైనవి మాన వద్దు" అని ఆబడ్జెట్ ధోరణిలోనే యేదో చెబుతున్నాడు.

"నాకదంతా తెలియదు. నావి, పిల్లలవి బట్టలు చిరిగిపోయాయి. ఎప్పటికప్పుడే చెబుదామని మళ్ళీ వెనక్కు తగ్గుతూ వచ్చాను మీకు విసుగ్గా వుంటుందని. ఇప్పుడిక చెప్పక తప్పనిసరి అయింది." అంది.

"అందరి బట్టలూ వొకమారే కొనాలా ? రెండుమూడు దఫాలుగా కొనకూడదూ ?" అన్నాడు. "ససేమిరా" అంది.

ఔను. ఎప్పుడైనా వొకటే ఖర్చు. ఎటొచ్చీ వొక్కమారు చాలా సొమ్ము షాపువాడిచేతిలో పొయ్యడానికి ప్రాణం వొప్పదు. ఆ సొమ్మే నాలుగుమార్లు చిన్న చిన్న మొత్తాలుగా చెల్లించితే బాధగా వుండదు. ఖర్చు వొకటేఅయినా ప్రయాస మాత్రం అవుతుంది నాలుగుమార్లు తిరగడానికి.

గోపాలానికి యేం తోచలేదు. అంత బాధపడ్డం యెందుకూ చేతగానితనంగా ! తను యింటికి యజమాని. తన యిష్టం వచ్చినట్టు చెయ్యడానికి తనకి అధికారం వుందే. ఆఫీసులోని అధికారికి క్రిందవాళ్లు గడగడలాడినట్టే గృహయజమానియైన తనకీ యింట్లో వాళ్లు గడగడలాడుతూండవలసిందే. అందుకు కొంత కరుకుదనం వుండాలి. ఎవ్వరికీ లొంగకూడదు. ఖర్మం చాలక లొంగాడో అతని తిప్పలు బ్రహ్మకి తెలియాల్సిందే.

గోపాలం అలాంటి కఠినమైనవాడు కాడు. జన్మతః మెత్తనివాడు చాలా. ఒకళ్ల మనస్సు నొప్పించేవాడుకాడు. తనే బాధపడేవాడు.

పేపరు చదవడము పూర్తిచేసి చల్లగాలికి కుర్చీ వాకిట్లో వేసుకుని కూర్చున్నాడు. పావుగంట అయిందో లేనేలేదో చిన్నపిల్లలిద్దరూ యేడుస్తూ చక్కావచ్చారు తండ్రి దగ్గరకి.

"యేం యేడుస్తున్నారు ? ఎవరు కొట్టారు ?" అన్నాడు గోపాలం.

"వీధిలో యెవరో అబ్బాయి మూడు చక్రాల సైకిలుతొక్కుకుంటూ పోతూంటే వీడు కూడా పోతున్నాడు. అల్లా యెంత దూరమని పోతావురా" అని యింట్లోకి లాక్కొచ్చాను. ఆ కోపం చేత వీడు నా కారు, రైలింజను విమానం నేలమీదవేసి కొట్టాడు గట్టిగా. విరిగిపోయాయి" అని మరీ యేడవడం మొదలుపెట్టాడు ఆ యిద్దరిలోనూ పెద్దవాడు.

గోపాలం ఆ యిద్దరినీ దగ్గరగా పిలిచి "అయితే యిప్పుడు మీకేం కావాలి ?" అని అడిగాడు.

ఇంతకన్న తెలివితక్కువ వుంటుంగా ? అల్లా అడుగుతారా యెక్కడైనా ? అడక్కుండానే "అవి కొను, యివి కొను" అని బాధిస్తూంటారే వీళ్లు, ఇక తనే యేం కావాలి?" అంటే హిరణ్యాక్షవరాలూ కోరకుండా విడిచిపెడతారా ? వాళ్లేమి అడిగితే అవి యివ్వడానికి సిద్ధంగావున్నట్టు అడిగిన తను ఆడినమాట తప్పతాడా ? ఆమాట నిలబెట్టుకుం కోసం హరిశ్చంద్రుడిలాగ, దశరథుడిలాగ బాధలు పడతాడా ?

అడిగిందే తడవుగా "మాకు సైకిళ్లు, విమానాలు, ట్రాంలు, కొత్తరైలుయింజన్లు కార్లు కావాలి" అన్నారు యేకగ్రీవంగా. అస్తమానం కొట్టుకుంటూ పట్టాపట్టకంపోరుగా వుండే వీళ్లు యేదైనా పనికావలసివచ్చినప్పుడుమాత్రం కావలసినంత సౌభ్రాతృత్వం కనబరుస్తారు. వీళ్లకనీసపుకోర్కెలు వినేటప్పటికి పార్లమెంటులో అసాధ్యపు కోరికలు సభ్యులు కోరగా విన్న ఆర్థికమంత్రిలా అయిపోయాడు. ఏగిలకలో డమడమాల బళ్లో కొనమంటారనుకున్నాడు. తీరా కొంటానన్నాడు. "పాపం ఆశపడ్డారే కొంటాననీ" అనే బాధ వొకవంక బాధిస్తోంది. రెండవ ప్రక్క కుటుంబ ఆర్థికవ్యవస్థ తారుమారవుతుందేమో ననే బాధ. ఈవిధంగా యెంతోసేపు మథనపడ్డాడు. ఇతని వాలకం చూసి వాళ్లు కొనడేమోనని సందేహించి మరీమరీ అడగడం ప్రారంభించారు. చివరికి 'సరే' అనక తప్పింది కాదు. ఆ మాట చెవినిపడగానే 'యిక కొనకేం చేస్తాడు" అనే ధీమాతో పరిగెత్తుకుపోయారు ఆడుకుందుకు.

"గోపాలరావుగారూ" అంటూ కేకవేసి ఓ కవరుచేతికిచ్చి చక్కాపోయాడు పోస్టువాడు. గోపాలం ఆకవరు విప్పి చదువుకుని మళ్లీ మడిచి జేబులో పెట్టేసుకున్నాడు.

ఆతనికి అందులో విషయమేమీ కొత్తకాదు. దాదాపు రెండు సంవత్సరా

(40వ పేజీ చూడుడు)

## లోటు బడ్జట్

(18 వ- పేజీ తరువాయి)

లుగా జరగుతున్నదే. ఇతని భూమి నొక భాన్ని దౌర్జన్యంగా కలుపుకుందామని యితని దాయాదులు చూడ్డంలో, పంట కోతకు రాగానే యజమానికాక తనుకోసుకోవడం, లేకపోతే యేగొడ్లనో తోలెయ్యడం వగైరాలు చేస్తూండడం జగద్విదితమే. మునసబు కరణాలకే సంగతి చెప్పి యిద్దరేసి మనుష్యులను కాపలా పెట్టించాడు డబ్బిచ్చి గోపాలం. వాళ్ళు కాపలావాళ్లని తంతే పోలీసు కాపలా కూడా పెట్టించాడు. ఏం చేసినా లాభంలేకపోయింది. పెద్దమనుష్యుల ద్వారా చెప్పిద్దామని ఎంతో ప్రయత్నిస్తే, అవతలవాళ్ల భయంవల్ల వొక్కరూ వాళ్లకి ప్రతికూలంగా చెప్పరే యితనికేగాని! ఈ విషయంలో చాలాసార్లు ఆఫీసుకి సెలవు పెట్టి వెళ్లాడు. ఏంతో డబ్బు ఖర్చు పెట్టాడు. ఇంకా సొమ్ము పట్టుకురమ్మని స్నేహితుడు వ్రాశాడా వుత్తరం. ఇప్పుడు మంచున్నపళంగా కొంతసొమ్ము దక్కకపోతే వీలులేదు.

"అయ్యగారూ, పాదులకి పురుగుపడుతోంది. మందు తెప్పించి చల్లితే పోతాయి. మంచి బలమైన యెరువు తెచ్చి వేస్తే బాగా కాస్తాయి. మన అబ్బాయిగారు చేతిగునపము, బాల్చీ ఆటల్లోకి పట్టికెళ్లి గునపము పారేశారుట. బాల్చీ తెచ్చారుగాని జల్లెడలాగుందండి. నీళ్లు నిలవడం లేదు. అదీగాక నూతిలో చేదవేస్తే మట్టితీసులుతోందండి. యెవరిచేతనైనా మట్టి తీయించి నుయ్యి బాగుచేయించాలండి. గునపమూ, బాల్చీ, మందూ, యెరువూ తెప్పించండి. పాదులు బాగా కాస్తాయి. లేకపోతే నావల్ల కాదు" అన్నాడు రంగయ్య.

ఎలక్ట్రిక్ డిపార్టుమెంటు బిల్లు, డాక్టరుబిల్లు కూడా రెండు నెలలక్రితమే వచ్చేశాయి. పాపం గోపాలం యెలా సర్దుకోగలడివన్నీ. ఏవైపు చూసినా ఖర్చెక్కువ, రాబడి తక్కువ కనబడుతోంది. ఈ సంగతి యెవరితో చెప్పుకుంటాడు? ఎవరితోనైనా చెప్పుకుంటే 'యింత చేతకానితనమా' అని హేళన చేస్తారని భయం. వచ్చే ఆదాయం మానుకుని జానికి తగ్గట్టుగా అన్నీ ఖర్చులూ సర్దుకుందామని అనుకోవడమే కాని అది క్రియారూపం దాల్చటం కు సాధ్యంలేదు. మానేస్తే నష్టం వచ్చే ఖర్చులు చేసకోవాలి. నలుగురిలో తలవంపులు కాకుండా యివ్వవలసిన బాకీలు యిచ్చెయ్యాలి. ఇక యెవరడిగినది నాకివ్వడం కాదు సరేకాని తగ్గించినా కోపంతో ముఖం చిట్లించుకుంటారు. ఇక వీరికి ప్రయాణాలు చేయించవలసివస్తే యింక చెప్పనక్కర్లేదు. కిరాయిలు, చేటలూ భరించవలసిందిగదిసే. ఇవన్నీ కాక పుట్టినరోజు పండుగలు, ఉత్సవాలు, బాధితులకోసం చందాలు. కొత్తగా డబ్బు సంపాదించడానికి సాధన లేనే లేదు. అన్నదమ్ములు పంచుకున్నప్పటినుండీ వచ్చే రాబడీ, తన జీతం అతని మొత్తం రాబడి. ఎంత తంటాలు పడ్డా ఆదాయానికి, వ్యయానికి పొత్తుపెట్టలేక పోయాడు. అప్పుచేస్తే "యెల్లా తీరుస్తాడు" అని లోకం విమర్శిస్తుంది. పోనీ అని ఎల్లాగో సర్దుతున్నా మెచ్చుకుందా? గౌరవం వుందా? తెలివైనవాడు అని సంతోషిస్తుందా లోకం? వాళ్లలో వాళ్లు సర్దుబాటు చేసుకునే స్వభావం కలిగివుండడమే వుండదు. ఖర్చం చాలక సర్దుబాటు చేసుకున్నా లోకంమాత్రం యెందుకో అందుకు విమర్శించి నిందలు మోపక మానదు.

"ఈ లోటుబడ్జట్‌తో వేగడం యెల్లాగ?" అని గోపాలం తలపట్టుకుని కూర్చున్నాడు.



భారతరిపబ్లిక్ అధ్యక్షులు శ్రీ బాబూ రాజేంద్రప్రసాద్‌గారు, ప్రపంచ సౌమనస్య సంఘ సమావేశాలకు వచ్చిన ఫిలిప్పైయిన్ ప్రతినిధి లారెన్జో బాటిస్టాలి ముచ్చటించుతున్నారు.